# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 30-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ఈ రాత్రి పీ.ఎస్.ఎల్.వీ. సీ-60 వాహక నౌక ద్వారా రెండు ఉపగ్రహాలను నింగిలోని పంపనుంది.

- జలాంతర్గాముల సామర్థ్యాన్ని పెంచే దిశగా రక్షణ మంత్రిత్వ శాఖ సాంకేతిక ఉత్పత్తులకు సంబంధించి రెండు ఒప్పందాలు చేసుకొంది.

- పంటల గరిష్ట అమ్మకం ధరకు చట్టపరమైన హామీ ఇవ్వాలన్న డిమాండ్ తో పంజాబ్‌లో రైతులు చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది.

- రానున్న రోజుల్లో ఉత్తర భారత దేశంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పడతాయని భారత వాతావరణ విభాగం తెలియజేసింది.

==============================

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ISRO శ్రీహరికోట నుండి రెండు ఉపగ్రహాలను ప్రయోగించనుంది. అంతరిక్ష నౌకల డాకింగ్, అన్‌డాకింగ్ లను ప్రదర్శించడానికి ఉద్దేశించి... ఆంధ్రప్రదేశ్ లోని శ్రీహరికోట నుండి ఈ రోజు రాత్రి 10 గంటల 15 సెకన్లకు ఈ ప్రయోగం చేపట్టనుంది. ఇస్రోకు చెందిన పీఎస్ఎల్‌వీ సీ-60 ఈరెండు ఉపగ్రహాలను నింగిలోకి తీసుకువెళ్లనుంది. వార్ హార్స్ రాకెట్, పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ రెండు ఉపగ్రహాలు SDX01, SDX02 లను 476 కిలోమీటర్ల ఎత్తులోని వృత్తాకార కక్ష్యలో ప్రవేశపెడుతుంది. అనంతరం వచ్చే నెల మొదటి వారంలో స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ SpaDEx ను చేపట్టనుంది. చంద్రుని నుండి రాళ్ళు, మట్టిని సేకరించడం, చంద్రుని ఉపరితలంపై వ్యోమగామిని దింపడం వంటి అంతరిక్ష పరిశోధనలో భారతదేశ భవిష్యత్ ప్రయత్నాలకు SpaDEx మిషన్ ఒక మెట్టు అని నిపుణులు పేర్కొంటున్నారు.

(వాయిస్ 39 సెకన్లు)

==============================

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ  శాఖ సుమారు 2 వేల 687 కోట్ల రూపాయల విలువైన ఒప్పందాలను చేసుకొంది. న్యూఢిల్లీలో రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో రెండు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఎయిర్ ఇండిపెండెంట్ ప్రొపల్షన్ (AIP) ప్లగ్ నిర్మాణం కోసం ముంబైలోని మజాగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్‌తో ఒక వెయ్యి 990 కోట్ల రూపాయల ఒప్పందం కుదిరిందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే.... ఫ్రాన్స్‌లోని నావల్ గ్రూప్‌తో సుమారు 877 కోట్ల రూపాయల వ్యయంతో మరో ఒప్పందం కుదుర్చుకుంది. AIP టెక్నాలజీని DRDO దేశీయంగా అభివృద్ధి చేస్తోందని పేర్కొంది. AIP ప్లగ్ నిర్మాణం, దాని ఏకీకరణకు సంబంధించిన ప్రాజెక్ట్ సాంప్రదాయ జలాంతర్గాముల సామర్థ్యాన్ని పెంచుతుందని, అలాగే... 'ఆత్మనిర్భర్ భారత్"కు దోహదపడుతుందని మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

==============================

పంటలకు గరిష్ఠ అమ్మకం ధరకు సంబంధించి చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. పంజాబ్‌లో రైతు సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. కిసాన్ యూనియన్ పిలుపు మేరకు పంజాబ్‌లో రైతులు చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. రైళ్ళు, బస్సుల రాకపోకలను అడ్డగించి, ట్రాఫిక్ ను స్తంభింపజేయడంతో సాధారణ ప్రజలకు అసౌకర్యం కలిగింది. అయితే అంబులెన్స్‌ల వంటి అత్యవసర సేవలు మామూలుగా కొనసాగాయి. ఈ నేపథ్యంలో భారతీయ రైల్వే శాఖ 150 రైళ్ళను రద్దు చేసింది. అదేవిధంగా 13 రైళ్ళను రీ షెడ్యూల్ చేసినట్టు ఉత్తర రైల్వే తెలియజేసింది.

==============================

రానున్న రోజుల్లో ఉత్తర  భారతదేశంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతాయని భారత వాతావరణ విభాగం ఐఎండీ తెలిపింది. దేశ రాజధానితో సహా ఉత్తర భారతదేశం మొత్తం నూతన సంవత్సర ప్రారంభంలో చల్లదనం నెలకొని ఉంటుందని పేర్కొంది. జమ్మూ కాశ్మీర్, లడఖ్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్ లలో చలిగాలులు వీస్తాయని వివరించింది. ఈశాన్య రాష్ట్రాలతో పాటు పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ లల్లో రానున్న 2 - 3 రోజుల పాటు రాత్రి, ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు అలముకుంటుందని, అలాగే... వాయువ్య భారత్‌లో కూడా దట్టమైన పొగమంచు కమ్ముకుంటుందని ఐఎండీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సోమా సేన్ రాయ్ వివరించారు. తమిళనాడు కోస్తా తీరంలో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు.

==============================

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు న్యూఢిల్లీలో పరిశ్రమ ప్రతినిధులతో 5వ ప్రీ - బడ్జెట్ సమావేశానికి అధ్యక్షత వహించారు. రాబోయే కేంద్ర బడ్జెట్ 2025 - 26 దృష్ట్యా జరిగిన ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక శాఖ ప్రధాన సలహాదారుతో పాటు ఆర్థిక, పెట్టుబడులు, ఆర్థిక వ్యవహారాలు, పరిశ్రమలు తదితర శాఖల కార్యదర్శులు హాజరయ్యారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కేంద్ర ఆర్థిక శాఖ యోచిస్తోంది. కాగా... ఈ బడ్జెట్... ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా 8వ సారి ప్రవేశపెట్టిన బడ్జెట్ గా నిలవనుంది.

విరామం

==============================

ఈ సంవత్సరం NCC రిపబ్లిక్ డే క్యాంప్ - 2025లో రికార్డు స్థాయిలో 917 మంది మహిళా క్యాడెట్లు పాల్గొంటున్నారని ఎన్‌సీసీ డీజీ లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్ తెలిపారు. నెల రోజుల పాటు జరగనున్న ఈ శిబిరం... ఢిల్లీ కంటోన్మెంట్ లోని కరియప్ప పరేడ్ గ్రౌండ్‌లో సర్వధర్మ పూజతో ఈరోజు ప్రారంభమైంది. 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చిన 2 వేల 361 మంది క్యాడెట్‌లు ఈ శిబిరంలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా డీజీ... శిబిరానికి ఎంపికైన క్యాడెట్‌లను అభినందించి, స్వాగతించారు. నేషన్ ఫస్ట్ అనే స్ఫూర్తితో మతం, భాష, కులం అనే

అడ్డంకులను అధిగమించి చిత్తశుద్ధి, నిస్వార్థ సేవ, సహృదయం, జట్టు కృషి వంటి లక్షణాలను ప్రదర్శించాలని ఆయన క్యాడెట్‌లకు సూచించారు.

==============================

గుజరాత్‌లో సుప్రసిద్ధ 'రన్ ఉత్సవ్'ను సందర్శించేందుకు ప్రజలు దేశం నలుమూలల నుండి వస్తున్నారు. ఈ ఉత్సవాన్ని సందర్శించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజ్ఞప్తికి స్పందించి ప్రజలు ఇక్కడకు వచ్చి, ఎడారి వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. సుమారు 3 నెలల పాటు జరిగే ఈ ఉత్సవాలు నూతన సంవత్సర వేడుకలకు ముందు ఉత్సాహంగా సాగుతున్నాయి. సందర్శకుల రద్దీని తట్టుకునే విధంగా ఇక్కడి ఉత్సవాల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. భుజ్ నుండి కచ్ వరకు సులభంగా చేరుకోవడానికి వోల్వో బస్సు సర్వీస్ లను ఏర్పాటు చేశారు.

==============================

మహా కుంభమేళా నేపథ్యంలో విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. తిరుపతి - బెనారస్ ప్రత్యేక రైలు జనవరి 18, ఫిబ్రవరి 8, 15, 23 తేదీల్లో శనివారం రాత్రి 8 గంటల 55 నిమిషాలకు తిరుపతిలో బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 3 గంల 45 నిమిషాలకు బెనారస్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు జనవరి 20, ఫిబ్రవరి 10, 17, 24 తేదీల్లో బెనారస్‌లో మంగళవారం సాయంత్రం 5 గంటల 30 నిమిషాల బయలుదేరుతుంది. అలాగే నర్సాపూర్-బెనారస్ ప్రత్యేక రైలు జనవరి 26, ఫిబ్రవరి 2 తేదీల్లో నర్సాపూర్‌లో ఉదయం 6 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3 గంటల 45 నిమిషాలకు బెనారస్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో జనవరి 27, ఫిబ్రవరి 3 తేదీల్లో రైలు బెనారస్‌లో సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు బయలుదేరుతుంది.

==============================

పూర్వ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ కు భారతరత్న బిరుదు ఇవ్వాలని తెలంగాణ శాసనసభ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తెలంగాణా శాసనసభ ఈరోజు ప్రత్యేకంగా సమావేశమయ్యి, దివంగత నేతకు ఘనంగా నివాళులు అర్పించింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన డాక్టర్ మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించగా శాసనసభ్యులు మద్దతు తెలిపారు. సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... మన్మోహన్ సింగ్ దూరదృష్టి గల ఆర్థికవేత్త అని, గొప్ప నాయకుడని గుర్తు చేసుకున్నారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ వంటి విధానాల ద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థను మార్చడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి పోటీతత్వానికి భారత్‌ను సన్నద్ధం చేశారని, ఆయన దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అని వ్యాఖ్యానించారు. వివిధ హోదాల్లో మన్మోహన్ చేసిన విశిష్ట సేవలను గుర్తు చేసుకున్నారు.

==============================

మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియా - భారత జట్ల మధ్య జరిగిన 4వ క్రికెట్ టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు 184 పరుగుల తేడాతో ఈరోజు విజయం సాధించింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 340 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ 155 పరుగులకే ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ 84 పరుగులు చేయగా... రిషభ్ పంత్ 30 పరుగులు చేశాడు. దీంతో ఐదు టెస్టుల సిరీస్‌లో ఆతిథ్య జట్టు 2-1 ఆధిక్యంలో ఉంది.

==============================
==============================